సాక్షి
కుమురం భీం

గురువారం । 24 । ఆగస్టు । 2023




క్షణాల్లో కుప్పకూలింది

కాగజ్‌నగర్‌టౌన్‌: పట్టణంలోని పేపర్‌ మిల్లు పునరుద్ధరణలో భాగంగా 50 మీటర్ల పొడవైన పాత చిమ్నీని బుధవారం కూల్చివేశారు. చిమ్నీ కుప్పకూలే సమయంలో భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ఎస్పీఎం యాజమాన్యం చిమ్నీ మొత్తాన్ని ముంబయికి చెందిన గుత్తేదారుకు విక్రయించగా, ఇనుప, ఇతర సామగ్రిని రెండు నెలలుగా లారీల ద్వారా తరలిస్తున్నాడు. ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుని బుధవారం కూల్చివేయించాడు.

గరిష్ఠం/కనిష్ఠం
31.3/26.8

వాతావరణం

ఆకాశం రోజంతా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతగా అనిపిస్తుంది. పలు ప్రాంతాల్లో చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

కోనప్పకు శుభాకాంక్షలు తెలిపిన ప్రభుత్వ విప్‌



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రభుత్వ విప్‌ అరికెపూడి గాంధీ

కాగజ్‌నగర్‌టౌన్‌: బీఆర్‌ఎస్‌ పార్టీ సిర్పూర్‌ నియోజకవర్గ అభ్యర్థిగా మరోసారి కోనేరు కోనప్పను ముఖ్యమంత్రి కేసీఆర్‌ ప్రకటించడంతో ప్రభుత్వ విప్‌ అరికెపూడి గాంధీ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో కోనప్పను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. సిర్పూర్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

ముగిసిన 'ఉన్నతి' శిక్షణ

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా ప్రధానోపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసినట్లు ఇన్‌చార్జి డీఈవో ఉదయ్‌బాబు తెలిపారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు విద్యార్థుల్లో అభ్యసనాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. త్వరలో స్కూల్‌ అసిస్టెంట్లకు శిక్షణ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌వో శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ సావిత్రి

ఆసిఫాబాద్‌రూరల్‌: పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతకు దూరంగా ఉండవచ్చని అంగన్‌వాడీ సంక్షేమశాఖ అధికారి సావిత్రి అన్నారు. ఆసిఫాబాద్‌ మండలంలోని వట్టివాగు, దాంపూర్‌, పాడిబండ అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం సందర్శించారు. పిల్లల హాజరు, ఎఫ్‌సీఆర్‌ ఫుడ్‌ రిజిస్టర్‌, చిన్నారుల ఎదుగుదల, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలు, గర్భిణులకు సక్రమంగా పౌష్టికాహారం అందించాలన్నారు. బాలామృతం పంపిణీలో నిర్లక్ష్యం చేయొద్దన్నారు. మెనూ ప్రకారం భోజనం, గుడ్లు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్‌ సోంబాయి, అంగన్‌వాడీ టీచర్లు లక్ష్మి, పార్వతి, రత్నమాల తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్‌ కేంద్రాలు తనిఖీ



పోలింగ్‌ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌ వేణు

కెరమెరి(ఆసిఫాబాద్‌): ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కొఠారి నుంచి కెరమెరి వరకు ఉన్న పలు పోలింగ్‌ కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్‌ దాసరి వేణు తనిఖీ చేశారు. విద్యుత్‌, తాగునీరు, ర్యాంపులు, తదితర సౌకర్యాలపై ఆరా తీశారు. బీఎల్‌వోల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. పోలింగ్‌ సిబ్బంది, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆయన వెంట తహసీల్దార్‌ జమీర్‌ తదితరులు ఉన్నారు.

పూలాజీ బాబా జయంతి విజయవంతం చేయాలి



కలెక్టర్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: జైనూర్‌ మండలం పట్నాపూర్‌లో ఈ నెల 29, 30 తేదీల్లో నిర్వహించే పూలాజీబాబా జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని కలెక్టర్‌ హేమంత్‌ బోర్కడే అన్నారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో బుధవారం సిద్ధ మహాయోగ పీఠ ధర్మసేనా సమితి సభ్యులతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఉత్సవాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్‌ కోరారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, అధికారులు పాల్గొన్నారు.

జాబిల్లిపై మన 'విక్రమ్‌'

- చంద్రుడిని చేరిన చంద్రయాన్‌– 3
- సాఫ్ట్‌ ల్యాండింగ్‌ ప్రక్రియ విజయవంతం
- ఇస్రో ఘనతపై సర్వత్రా శుభాకాంక్షల వెల్లువ
- టీవీల్లో ప్రయోగాన్ని వీక్షించిన విద్యార్థులు



జాబిల్లిపై పరిశోధనల కోసం జూలై 14న నింగిలోకి దూసుకెళ్లిన 'చంద్రయాన్‌– 3' ఇస్రోకు మరో ఘనతను అందించింది. విక్రమ్‌ ల్యాండర్‌ మాడ్యూల్‌ చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని విజయవంతంగా చేరుకుంది. బుధవారం సాయంత్రం ఈ అపురూప ఘట్టం ఆవిష్కృతమైంది. చంద్రయాన్‌– 2 వైఫల్యాలను సరిదిద్దుకుని భారత శాస్త్రవేత్తలు విజయాన్ని ముద్దాడారు. క్షణక్షణం ఉద్విగ్నభరితంగా సాగిన 'విక్రమ్‌' సాఫ్ట్‌ల్యాండింగ్‌ ప్రక్రియను దేశ ప్రజలతోపాటు ప్రపంచ దేశాలు ఆసక్తిగా తిలకించాయి. జిల్లాలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులు ఈ ప్రక్రియను టీవీల్లో వీక్షించారు. ఉపాధ్యాయులు ప్రయోగ విశేషాలను వారికి క్షుణ్ణంగా వివరించారు. చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని మొదటిసారి చేరి, అంతరిక్ష రంగంలో చారిత్రాత్మకమైన ముద్ర వేసిన ఇస్రో విజయంపై విద్యార్థులు వారి అభిప్రాయాలను 'సాక్షి'తో పంచుకున్నారు. – ఆసిఫాబాద్‌



జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు



జిల్లా కేంద్రంలోని సాంఘిక సంక్షేమ కళాశాలలో వీక్షిస్తున్న విద్యార్థులు

దక్షిణ ధ్రువం.. రహస్యాల పుట్ట



భారత శాస్త్రవేత్తల ఘన విజయం ఇది. చంద్రుడి దక్షిణ ధ్రువంపైకి మొదటిసారిగా పంపిన చంద్రయాన్‌ ల్యాండింగ్‌ విజయవంతమైంది. ఇది భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా నిలిపింది. దక్షిణ ధ్రువం అనేది రహస్యాల పుట్ట. ఇక్కడ జరిపే పరిశోధన విశ్వం, భూమి పుట్టుక గురించి తెలుసుకోవడానికి మార్గం సుగమం చేస్తుందని భావిస్తున్నారు.

– మధుకర్‌, జిల్లా సైన్స్‌ అధికారి

గర్వించే రోజు



రెబ్బెన: యావత్తు దేశం గర్వించే రోజు ఇది. ఇండియా సత్తా మరోసారి ప్రపంచ దేశాలకు తెలిసింది. చంద్రయాన్‌– 3 ప్రయోగం విజయవంతం శాస్త్రవేత్తల్లో కొత్త ఉత్సాహం నింపింది. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేపట్టొచ్చు.

– బాలునాయక్‌, ఐటీఐ విద్యార్థి, రెబ్బెన

విజయ క్షణాలు..



చంద్రయాన్‌– 3 చంద్రుడిపై సేఫ్‌గా దిగే వరకు ఆ విజయ క్షణాలను విద్యార్థులకు చూపించాం. ఇందుకోసం కళాశాలలో ప్రత్యేకంగా ప్రొజెక్టర్‌ ఏర్పాటు చేశాం. విజ్ఞాన రంగంలో భారత్‌ తన ముద్ర వేసింది.

– ఊటూరి శ్రీనాథ్‌, ప్రిన్సిపాల్‌, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(ఆసిఫాబాద్‌)

శాస్త్రవేత్తలకు సెల్యూట్‌



భారత విజయం అద్భుతం. చంద్రుడి దక్షిణ ధ్రువంపైకి చేరిన మొదటి దేశంగా నిలిచాం. ఇస్రో శాస్త్రవేత్తలకు సెల్యూట్‌. ఈ విజయాన్ని చూసి యావత్‌ ప్రపంచం నివ్వెరపోయింది.– నగరాడె తదాగత్‌, ఎంపీసీ, మోడల్‌ స్కూల్‌, ఆసిఫాబాద్‌

సైన్స్‌పై ఇష్టాన్ని పెంచింది



ఇస్రో సాధించిన విజయాన్ని టీవీల్లో చూడటం మా అదృష్టం. అంతరిక్ష రంగంలో ఇస్రో కొత్త చరిత్ర లిఖించడం చాలా గొప్ప విషయం. ఈ ప్రయోగం సైన్స్‌పై ఇష్టాన్ని పెంచింది.

– నక్క శంకర్‌, ఎంపీసీ, మోడల్‌ స్కూల్‌, ఆసిఫాబాద్‌

నవ భారత విజయం



రైలు ప్రయాణంలో ఉన్నా కూడా చంద్రయాన్‌ –3 ప్రయోగాన్ని సెల్‌ఫోన్‌లో వీక్షించా. అంతరిక్ష చరిత్రలో సరికొత్త రికార్డు. నవ భారత విజయం ఇది.

– కొనసరి శ్రీరామ్‌ మణికంఠ, బైపీసీ, మోడల్‌ స్కూల్‌, ఆసిఫాబాద్‌

సాంకేతిక ప్రగతికి నిదర్శనం



ఇది భారతదేశం సాధించిన సాంకేతిక ప్రగతికి నిదర్శనం. దేశ కీర్తి కిరీటాల్లో మరో ఆభరణం చేరింది. ఇస్రో సాధించిన మరో చారిత్రక ఘనత. ఈ విజయాన్ని కళాశాలలో వీక్షించడం గుర్తుండిపోయే క్షణం.

– రామిళ్ల అజయ్‌కుమార్‌, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల(ఆసిఫాబాద్‌)

థ్యాంక్స్‌ టు ఇస్రో



మంగళ్‌యాన్‌ విజయవంతమైన తర్వాతి నుంచి చంద్రయాన్‌– 3 ప్రయోగం కోసం ఎదురు చూస్తున్నాం. ఈ అద్భుత క్షణాలను వీక్షించే అవకాశం కల్పించిన ఇస్రోకు థ్యాంక్స్‌.

– కామ్రె రాహుల్‌, సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాల, ఆసిఫాబాద్‌

ఇండియా విజయం ఇది..



చంద్రుడిపై దాగి ఉన్న ఎన్నో రహస్యాలకు ఇప్పటికీ సమాధానం లేదు. చంద్రయాన్‌– 3 ప్రయోగం చంద్రుడి దక్షిణ ధ్రువాన్ని మనకు చూపించింది. ఇది ఇస్రోదే కాదు. మన ఇండియా విజయం.

– ఎం.హర్షిత, ఎంపీసీ, మోడల్‌ స్కూల్‌, ఆసిఫాబాద్‌

ఇస్రోలో చేరుతా



చంద్రుడిపై రోవర్‌ ల్యాండింగ్‌ను ఎంతో ఆతృతతో చూశా. చంద్రయాన్‌– 2 విఫలమవడం ఎంతో బాధ కలిగించింది. చంద్రయాన్‌– 3 విజయం ఆ బాధను దూరం చేసింది. భారతీయుడిగా గర్వపడుతున్నా. భవిష్యత్తులో ఇస్రోలో చేరి సేవలందిస్తా.

– ఎస్‌.జశ్వంత్‌, పదో తరగతి, మోడల్‌ స్కూల్‌, ఆసిఫాబాద్‌

మట్టి గణపతులను పూజిద్దాం

సిర్పూర్‌(టి): వినాయక చవితి ఉత్సవాల్లో మట్టి గణపతి ప్రతిమలను మాత్రమే పూజిద్దామని జాతీయ హరితదళం రీజనల్‌ కోఆర్డినేటర్‌ విద్యాసాగర్‌ పిలుపునిచ్చారు. సిర్పూర్‌(టి) మండలం వేంపల్లిలోని జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలో కాలుష్య నియంత్రణ మండలి, జాతీయ హరితదళం ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు మట్టి గణపతి ప్రతిమల ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పర్యావరణ రక్షణ, కాలుష్య నియంత్రణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం వారితో మట్టి ప్రతిమలను తయారు చేయించారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు అధికారి సత్తయ్య, జాతీయ హరితదళం జిల్లా కోఆర్డినేటర్‌ కటకం మధుకర్‌, ప్రధానోపాధ్యాయుడు చిలుకూరు సత్యనారాయణ, ఉపాధ్యాయులు లక్ష్మీనారాయణ, ప్రకాశ్‌, స్వరూప, సుగుణ, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



సిర్పూర్‌(టి): మట్టి ప్రతిమలతో విద్యార్థులు

ఆసిఫాబాద్‌రూరల్‌: జిల్లా కేంద్రంలోని జన్కాపూర్‌ ఉన్నత పాఠశాలలో బుధవారం మట్టి వినాయక ప్రతిమల తయారీ, వాటి ప్రాముఖ్యత గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో 200 ప్రతిమలు తయారు చేయించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్‌ అధికారి మధుకర్‌, హెచ్‌ఎం సుభాష్‌, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉమాబాల, కిషన్‌రావు పాల్గొన్నారు.

'దిందా' వంతెన నిర్మాణానికి స్థల పరిశీలన

చింతలమానెపల్లి(సిర్పూర్‌): మండలంలోని కేతిని నుంచి దిందా గ్రామానికి మార్గంలో వాగుపై హైలెవల్‌ వంతెన నిర్మాణ స్థలాన్ని బుధవారం ఇంజినీరింగ్‌ శాఖ అధికారులు పరిశీలించారు. పంచాయతీరాజ్‌ డీఈ రామ్మోహన్‌, ఏఈ రాజ్‌కుమార్‌ ఆధ్వర్యంలో వంతెన వద్ద కొలతలు తీసుకున్నారు. వంతెన నిర్మాణానికి మొదటి దశ అనుమతులు మంజూరయ్యాయి. ఈ మేరకు రూ.60లక్షల నష్ట పరిహారం చెల్లించాలని అటవీశాఖ నివేదించింది. ఈ నివేదికను ప్రభుత్వానికి అందించినట్లు, త్వరలోనే రెండో దశ అనుమతులు మంజూరవుతాయని సంబంధిత అధికారులు వెల్లడించారు. రెండేళ్ల క్రితం రూ.4.60 కోట్లతో మంజూరైన వంతెన నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించినట్లు అధికారులు తెలిపారు. తాజా పరిస్థితుల నేపథ్యంలో వంతెన డిజైన్‌ మార్చాల్సి ఉంటుందని, అందుకు అనుగుణంగా కొలతలు తీసుకున్నట్లు డీఈ పేర్కొన్నారు.



స్థలాన్ని పరిశీలిస్తున్న ఇంజినీరింగ్‌ అధికారులు

ఈ విషయాన్ని కాంట్రాక్టర్‌కు వివరించామని, వాగులో వరదను అనుసరించి వంతెన డిజైన్‌ మారుతుందని వెల్లడించారు. ఎంపీపీ డుబ్బుల నానయ్య మాట్లాడుతూ వంతెన పనులను ఎన్నికల కోడ్‌ వచ్చేలోగా ప్రారంభించి, త్వరగా పూర్తయ్యేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం నుంచి అన్నిరకాల అనుమతులు వచ్చేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

చెరువు చెంతకు చేప

- 1.40 కోట్ల చేపపిల్లల పంపిణీకి అధికారుల కసరత్తు
- జిల్లాలోని 280 జలాశయాల్లోకి విడుదల
- ఇప్పటికే పూర్తయిన టెండర్లు

ఏడేళ్లలో విడుదల చేసిన చేపపిల్లలు

సంవత్సరం	చెరువులు	చేపపిల్లలు (లక్షల్లో)	వ్యయం (రూ.లక్షల్లో)
2016– 17	37	30.41	24.75
2017– 18	74	77.72	66.03
2018–19	199	122.01	111.45
2019– 20	246	123.23	97.6
2020– 21	249	123.42	119.63
2021– 22	284	138.82	150.43
2022– 23	269	137.29	127.39



పీపీరావు ప్రాజెక్టులోకి చేపపిల్లలు వదులుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు(ఫైల్‌)

దహెగాం(సిర్పూర్‌): మత్స్యకారులు ఆర్థిక స్వావలంబన సాధించడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలు, సభ్యులకు వ్యక్తిగత సహకార రుణాలు అందించడంతోపాటు చెరువులు, కుంటల్లో పెంచుకునేందుకు ఉచితంగా చేపపిల్లలను అందిస్తోంది. మత్స్య సంపదను పెంపొందించేందుకు చర్యలు చేపడుతోంది.

టెండర్‌ ప్రక్రియ పూర్తి..

జిల్లాలో 10,948 హెక్టార్ల విస్తీర్ణంలో 299 జలశయాలు, చెరువులు, కుంటలు విస్తరించి ఉన్నాయి. ప్రధాన ప్రాజెక్టులు, చెరువుల్లోకి చేపపిల్లలను వదిలేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే టెండర్‌ ప్రక్రియ కూడా పూర్తయింది. ఈ నెల 26 నుంచి చేపపిల్లలు పంపిణీ చేస్తామని స్వయంగా రాష్ట్ర మంత్రి ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే జిల్లాలో ఈ ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. ఈ నెలాఖరులో గానీ.. సెప్టెంబర్‌ మొదటి వారం నుంచి చేప పిల్లల పంపిణీ ప్రక్రియ ప్రారంభం కావొచ్చు.

280 చెరువుల్లోకి విడుదల..

జిల్లా వ్యాప్తంగా 299 జలాశయాలు ఉండగా, 60 మత్స్య పారిశ్రామిక సంఘాల్లో 3,500 మంది సభ్యులుగా పేరు నమోదు చేసుకున్నారు. ఈ ఏడాది 280 చెరువులు, కుంటల్లో 1.40 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయడానికి అధికారులు సమయాత్తం అవుతున్నారు. ఏడేళ్లుగా జలాశయాల్లో మత్స్య సంపద వృద్ధి చెందుతోంది. జూలైలో భారీ వర్షాలు కురవడంతో ప్రధానమైన కుమురంభీం, వట్టివాగు ప్రాజెక్టులతోపాటు చెరువులు, కుంటల్లోకి భారీగా వరద చేరింది. కట్ల, రోహూ, బంగారు తీగ, మ్రిగాల వంటి రకాలను జలాశయాల్లోకి వదలనున్నారు. చేపపిల్లలు కిలో నుంచి రెండు కిలోల వరకు పెరిగిన తర్వాత పట్టణ ప్రాంతాల్లో మార్కెట్‌కు తరలించి విక్రయిన్నారు. మత్స్య సంపద మరింత పెరిగి మత్స్య సంఘాల సభ్యులకు లాభాలు తెచ్చి పెట్టే అవకాశాలు ఉన్నాయి.

నాలుగు రకాల చేప పిల్లలు..

జలాశయాల్లో నాలుగు రకాల చేప పిల్లలను వదలనున్నారు. బొచ్చ, రవ్వ, బంగారు తీగ, మ్రిగాల చేప పిల్లలను వదలనున్నారు. చిన్న కుంటలు, చెరువుల్లో ఈ చేప పిల్లలను వదులుతుండగా రిజర్వాయర్లలో బంగారు తీగ, మెరిగె రకం చేప పిల్లలను వేస్తున్నారు. ఈ ఏడాది 1.40 కోట్ల చేప పిల్లలను పంపిణీ చేయాలని మత్స్యశాఖ లక్ష్యంగా పెట్టుకుంది. చెరువులు, కుంటల్లో 35 నుంచి 45 మిల్లీమీటర్ల పరిమాణం ఉండే పిల్లలను, పెద్ద జలాశయాలలో 80 నుంచి 100 మిల్లీమీటర్ల సైజులో ఉండే వాటిని వదలనున్నారు. ఇప్పటి వరకు రూ.698 లక్షల వ్యయంతో 736.74 లక్షల చేప పిలలను ఉచితంగా సరఫరా చేశారు. 2023–24 సంవత్సరంలో రూ.1.68 కోట్లతో వ్యయం 1.40 కోట్ల చేపపిల్లలను పంపిణీ చేయనున్నారు.

నెలాఖరులోగా విడుదల



మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలు పంపిణీ చేస్తుంది. ఈ సంవత్సరం 288 చెరువులు, కుంటల్లో 1.40 కోట్ల చేపపిల్లలను ఈ నెలాఖరులోగా వదులుతాం. టెండర్లు కూడా పూర్తయ్యాయి. అన్ని నీటి వనరుల్లోకి చేపపిల్లలను విడుదల చేస్తాం.

– విజయ్‌కుమార్‌, జిల్లా మత్స్యశాఖ అధికారి

పింఛన్లు పెంచిన ఘనత కేసీఆర్‌దే

- జెడ్పీ వైస్‌చైర్మన్‌ కోనేరు కృష్ణారావు

కాగజ్‌నగర్‌టౌన్‌: దివ్యాంగుల సంక్షేమం కోసం పథకాలు అమలు చేయడంతోపాటు పింఛన్లు పెంచిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దే అని జెడ్పీ వైస్‌చైర్మన్‌ కోనేరు కృష్ణారావు అన్నారు. కాగజ్‌నగర్‌ పట్టణంలోని ఆరె సంక్షేమ సంఘ భవనంలో బుధవారం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఆసరా పింఛన్‌ పెంపు పత్రాల పంపిణీ కార్యక్రమానికి మున్సిపల్‌ చైర్మన్‌ సద్దాం హుస్సేన్‌తో కలిసి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడినప్పుడు రూ.200 ఉన్న పింఛన్‌ను కేసీఆర్‌ రూ.4,016లకు పెంచారన్నారు. కాంగ్రెస్‌ హయాంలో ఉన్న పింఛన్లతో ఒక పూట భోజనం చేయలేని పరిస్థితిలో దివ్యాంగులు ఉన్నారని ఎద్దేవా చేశారు. ఖర్చులకు అనుగుణంగా



పత్రాలు అందిస్తున్న జెడ్పీ వైస్‌చైర్మన్‌, తదితరులు

పింఛన్లు పెంచితే ఓర్వలేని కాంగ్రెస్‌, బీజేపీ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దివ్యాంగులపై రాజకీయం చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో అధికారులు, కౌన్సిలర్లు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



పూజలు చేస్తున్న బీజేపీ నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్‌: ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చంద్రయాన్‌– 3 ప్రయోగం విజయవంతం కావాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్‌ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు జాడె ప్రకాశ్‌, జయరాజ్‌, శ్రీధర్‌, వడ్డెపల్లి సత్యనారాయణ, సాయి, వినోద్‌, శ్రావణ్‌, ఫణి పాల్గొన్నారు. కేస్లాపూర్‌ హనుమాన్‌ ఆలయంలో డీడీఎస్‌ అర్చక సంఘం అధ్యక్షుడు ఒజ్జల శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఉదయ్‌, రఘు, సుధాకర్‌ ఉన్నారు.

'అభివృద్ధికి బీజేపీ కృషి'

బెజ్జూర్‌(సిర్పూర్‌): పల్లెల అభివృద్ధికి బీజేపీ కృషి చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని సలుగుపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద బుధవారం మహారాష్ట్రలోని చిమూర్‌ ఎమ్మెల్యే బంటి బావు భాంగ్డియాతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సొమ్ము కేంద్ర ప్రభుత్వానిదైతే.. సోకులు రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందని ధ్వజమెత్తారు. సలుగుపల్లి నాలుగు రోడ్ల కూడలి వద్ద నూతనంగా వేసిన రోడ్లను చూస్తే కేంద్ర ప్రభుత్వం అభివృద్ధికి చేస్తున్న కృషి కనిపిస్తుందన్నారు. ఎక్స్‌రోడ్‌ నుంచి తలోడి వరకు, పెంచికల్‌పేట్‌ వరకు డబుల్‌ రోడ్డు నిర్మాణం కేంద్ర ప్రభుత్వ నిధులతోనే సాధ్యమైందని పేర్కొన్నారు. గొల్లబాయి, అర్కగూడెం, బొక్కివాగు, ప్రాణహిత ప్రాజెక్టుల పరిస్థితిని చూస్తే స్థానిక



మాట్లాడుతున్న హరీశ్‌బాబు

ఎమ్మెల్యే చేసిన అభివృద్ధి అవగతం అవుతుందని విమర్శించారు. సమావేశంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, మండల అధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు శంకరమ్మ పాపయ్య, మోహన్‌, విజయ్‌, తిరుపతి, వసిఉల్లా ఖాన్‌, రామయ్య, ఇందిర, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డెయిరీ నిర్వాహకుడిపై కేసు

బెల్లంపల్లి: పట్టణంలోని ఆరిజిన్ డెయిరీ నిర్వాహకుడు ఆదినారాయణపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో టి.శంకరయ్య తెలిపారు. బెల్లంపల్లి బాబుక్యాంపు బస్తీకి చెందిన నస్పూరి సందీప్ ఓ పత్రికలో వచ్చిన వార్తాకథనం క్లిప్పింగ్‌ను ఈ నెల 22న ఓ వాట్సాప్ గ్రూపులో పోస్టు చేశాడు. ఆపోస్టును చూసిన ఆరిజిన్ డెయిరీ నిర్వాహకుడు ఆగ్రహం చెంది సందీప్‌ను దుర్భాషలాడాడు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణం

మంచిర్యాలరూరల్(హాజీపూర్):జీవితంపై విరక్తితో ఒకరు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై నరేష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం హాజీపూర్ మండలంలోని దొనబండకు చెందిన ర్యాకల సత్తయ్య (46) అనే గొర్రెల కాపరి ఐదేళ్లుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. ఇటీవల సత్తయ్య కుమార్తె మహేశ్వరి కుమారుడి ఆరోగ్యం కూడా బాగా లేకపోవడంతో సత్తయ్య మానసికంగా కృంగిపోయాడు. మంగళవారం కుమారుడు శేఖర్‌తో కలిసి పశువులను మేపేందుకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. పంటపొలంలో గుర్తు తెలియని క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుమారుడు శేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి బానిసై ఒకరు ...

దహెగాం(సిర్పూర్): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై సనత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని మురళీగూడకు చెందిన కుమురం శ్రీనివాస్ (55) కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. బుధవారం మేకలకు మేత తీసుకువస్తానని చెప్పి గ్రామ సమీపంలోని ధనూరి శంకర్ పంటచేనులో ఉన్న చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమీపంలోని చేలలో పనిచేస్తున్న కూలీలు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుని భార్య కుమురం సత్తక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

సింగరేణి రిటైర్డు కార్మికుడు ఆత్మహత్య


భూమయ్య(ఫైల్)

బెల్లంపల్లి: పట్టణంలోని కన్నాలబస్తీకి చెందిన సింగరేణి రిటైర్డు కార్మికుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు వన్‌టౌన్ ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కన్నాలబస్తీకి చెందిన బియ్యాల భూమయ్య(65) 2008లో ఉద్యోగ విరమణ చేశాడు. అప్పటి నుండి మద్యానికి బానిసయ్యాడు. అంతేకాకుండా కుటుంబ సభ్యులు వరుసగా మృతి చెందారు. చివరికి అతని భార్య కూడా ఇటీవలే మృతి చెందడంతో మానసికంగా కృంగిపోయాడు. ఇంట్లో ఒంటరిగా ఉన్న భూమయ్య మంగళవారం రాత్రి ఇంట్లో దూలానికి లుంగీతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వన్యప్రాణిని వేటాడిన వ్యక్తిపై కేసు

పెంచికల్‌పేట్(సిర్పూర్): వన్యప్రాణిని వేటాడిన అగర్‌గూడకు చెందిన చౌదరి సాయికృష్ణపై బుధవారం కేసు నమోదు చేసినట్లు పెంచికల్‌పేట్ రేంజ్ అధికారి వేణుగోపాల్ తెలిపారు. సాయికృష్ణ అగర్‌గూడ తన పంటచేను సమీపంలో వన్య ప్రాణులను వేటాడటానికి అమర్చిన ఉచ్చులోపడి కొండగొర్రె మృతి చెందింది. నిందితుడిని అదుపులోకి తీసుకున్న అటవీశాఖ సిబ్బంది వన్యప్రాణి సంరక్షణ చట్టం-1972 ప్రకారం కేసు నమోదు చేశారు.

నాలుగేళ్లుగా నిరుపయోగంగానే..!

- 2019లో కమాండ్ కంట్రోల్ రూం నిర్మాణం
- సీసీఆర్‌ను పట్టించుకోని పోలీస్ ఉన్నతాధికారులు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్న భవనం


అటవీప్రాంతాన్ని తలపిస్తున్న కమాండ్ కంట్రోల్ రూమ్

మంచిర్యాలక్రైం: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ పోలీస్‌శాఖ పవర్ ఫుల్ స్థాయికి ఎదిగింది. గతంలో పోలీసింగ్ విధానం అంటే ఖాకీ నెక్కర్, తలపై ఎర్రటోపి, చేతిలో లాఠీ, మరో చేతిలో విజిల్ వేస్తూ నడుచుకుంటూ లేదా సైకిల్‌పై గస్తీ నిర్వహించేవారు. ప్రస్తుతం పోలీస్ శాఖలో పరిస్థితి అంత మారిపోయింది. సాంకేతిక విప్లవంతో అంచనాకు అందని ఎత్తుకు దూసుకెళ్తోంది. నేరాలను అరికట్టడంలో రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్న సాంకేతికతను అందిపుచ్చుకుంటూ నేర నియంత్రణకు కృషి చేస్తోంది. అధునాతనమైన వాహనాలతో పాటు నూతనంగా పోలీస్ స్టేషన్ల నిర్మాణం చేపడుతున్నారు. అంతేకాకుండా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా జిల్లా మొత్తం నిఘానీడలోకి వచ్చేలా సీసీ కెమెరాల పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లా కేంద్రంలో కమాండ్ కంట్రోల్ రూమ్ (సీసీఆర్)ల నిర్మాణం చేపట్టింది.

జిల్లాలో 2019లో సీసీఆర్ నిర్మాణం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నిర్మల్, ఆదిలాబాద్‌లో సీసీఆర్ బిల్డింగ్‌ల నిర్మాణం పూర్తయి వినియోగంలో ఉంది. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో బిల్డింగ్ నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. మంచిర్యాల జిల్లాకు సంబంధించిన సీసీఆర్ బిల్డింగ్ కోసం బెల్లంపల్లి సబ్ డివిజన్‌లోని హన్మాన్‌బస్తీలో 3.20 ఎకరాల ప్రభుత్వ స్థలం కేటాయించారు. బెల్లంపల్లికి చెందిన కాంట్రాక్టర్ పద్మారెడ్డి టెండర్ దక్కించుకున్నారు. కోటి రూపాయలతో విశాలమైన వాతావరణంలో అధునాతన హంగులతో కమాండ్ కంట్రోల్ రూమ్‌తో పాటు అధికారి నివాస గృహాన్ని 2019లో నిర్మించారు. నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ ప్రారంభానికి నోచుకోలేదు. దీంతో బిల్డింగ్ అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందని పలువురు చర్చించుకుంటున్నారు. అంతేకాకుండా భవనం కోసం కేటాయించిన స్థలం చుట్టూ సదరు కాంట్రాక్టర్ పెన్సింగ్ సైతం ఏర్పాటు చేశారు. కానీ కబ్జాదారులు ప్రస్తుతం పెన్సింగ్ ఆనవాళ్లు లేకుండా చేయడం గమనార్హం.

దొంగల స్వైరవిహారం

పోలీసుల కోసం ఏర్పాటు చేసిన కమాండెంట్ కంట్రోల్ రూమ్ నిర్మించిన ప్రాంతం నిర్మానుష్యంగా ఉండడంతో దొంగలు స్వైరవిహారం చేస్తున్నారు. బిల్డింగ్ నిర్మాణం పూర్తయి నాలుగేళ్లు కావస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆప్రాంతం అటవీ ప్రాంతాన్ని తలపిస్తోంది. అంతేకాకుండా గతంలో దొంగలు పడి ఫ్యాన్లు, డోర్లు ఎత్తుకెళ్లిన సంఘటనలున్నాయి. ఐదు నెలల క్రితం చోరీ కేసులో 15 మందిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. చోరీకి గురైన సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

బిల్డింగ్ పూర్తయినా బిల్లులు రాలే...

కమాండెంట్ కంట్రోల్ రూమ్ నిర్మాణానికి రూ.50 లక్షలతో టెండర్ వేశా. అందులో ఒక్క సీసీఆర్ నిర్మాణం మాత్రమే ఉండగా అదనంగా అధికారుల నివాసగృహం, మరికొన్ని గదులు అదనంగా నిర్మించాలని ఉన్నతాధికారులు ఆదేశించడంతో మరో రూ.50 లక్షల సొంతడబ్బులతో నిర్మాణం పూర్తిచేశా. రూ. 30 లక్షలు మాత్రమే చెల్లించారు. నాలుగేళ్లు కావస్తున్నా ఇప్పటికీ బిల్లులు రాలేదు. - పద్మారెడ్డి, కాంట్రాక్టర్, బెల్లంపల్లి

డిపార్ట్‌మెంట్‌కు అప్పగించలేదు



మంచిర్యాల, బెల్లంపల్లిలో నిర్మించిన కమాండ్ కంట్రోల్ రూమ్ బిల్డింగ్ పూర్తి అయ్యింది. కానీ భవనాన్ని సదరు కాంట్రాక్టర్ ఇప్పటి వరకు డిపార్ట్‌మెంట్‌కు అప్పగించలేదు. సీసీఆర్ గురించి పూర్తి సమాచారం లేదు.
- సుధీర్ రామ్‌నాథ్‌కేకన్, డీసీపీ, మంచిర్యాల

'మంచిర్యాల అసెంబ్లీ టికెట్ బీసీలకు ఇవ్వాలి'


సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

పాతమంచిర్యాల: మంచిర్యాల అసెంబ్లీ నియోజకవర్గం టికెట్‌ను బీసీలకు ఇవ్వాలని రాజ్యాధికార బీసీ ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రం నుంచి శ్రీరాంపూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం శ్రీరాంపూర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న బీసీ నాయకులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు, గాజుల ముఖేష్‌గౌడ్, డాక్టర్ రమణ, డాక్టర్ రఘునందన్, అక్కల తిరుపతి, దొమ్మటి అర్జున్, నీలి శ్రీనివాస్, ఆశాలత బుజ్జన్న మాట్లాడారు. జిల్లాలో 70 శాతం బీసీ జనాభా ఉందని, రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన బీసీలకే ఎమ్మెల్యే టికెట్ కేటాయించాలని డిమాడ్ చేశారు. లేనిపక్షంలో తామంతా కలిసి స్వతంత్ర అభ్యర్థిని బరిలో నిలబెట్టి గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్యాధికార బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు చుంచు రాజ్‌కిరణ్, తెలంగాణ బీసీ జాగృతి జిల్లా అధ్యక్షుడు నరెడ్ల శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు భాస్కర్, బీసీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఏరియా స్థితిగతులను బట్టి వార్షిక లక్ష్యం


సమావేశంలో వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యులు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఏరియా స్థితిగతులను బట్టి వార్షిక లక్ష్యం నిర్ణయించడం జరుగుతుందని వార్షిక ప్రణాళిక కమిటీ సభ్యులు పేర్కొన్నారు. బుధవారం బెల్లంపల్లి ఏరియా అధికారులతో సమావేశమయ్యారు. గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయంలో కమిటీ సభ్యులు రవికుమార్ (డీజీఎం, ఐఅండ్‌పీఎం), రామారావు (డీజీఎం ఐఅండ్‌పీఎం), బి.చక్రవర్తి (డీజీఎం ఈఅండ్‌ఎం), రామకృష్ణ, నటరాజ్ (ఈఈ ఈఅండ్‌ఎం) 2024-25 ఆర్థిక సంవత్సరానికి గానూ ఏరియా వార్షిక ఉత్పత్తి లక్ష్య నిర్దేశంపై ఏరియా అధికారులతో చర్చించారు. ఏరియాలో ప్రస్తుతం చేపడుతున్న ఉత్పత్తి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ రవిప్రసాద్ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం తిరుమల్‌రావు, పీవో ఉమాకాంత్, ఏరియా సర్వే అధికారి చంద్రశేఖర్, పీఈ రాజాజీ, డీజీఎం సీహెచ్‌పీ భీంరావు జాడే, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్‌ల మరమ్మతు పూర్తి చేయాలి


మొక్క నాటుతున్న బర్తేశ్‌కుమార్ జైన్

నస్పూర్(మంచిర్యాల): శ్రీరాంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ నుండి రైల్వేలైన్ ద్వారా జైపూర్ సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్‌కు వెళ్తున్న రైల్వే ట్రాక్‌లకు ఏమైనా మరమ్మత్తులు ఉంటే వాటిని ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని సెంట్రల్ రైల్వే సికింద్రాబాద్ రైల్వే మేనేజర్ బర్తేశ్ కుమార్ జైన్ సూచించారు. బుధవారం ఆయన శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డితో కలిసి సీహెచ్‌పీని సందర్శించారు. బొగ్గును వ్యాగన్లలో నింపే విధానాన్ని పరిశీలించారు. పర్యావరణ పరిరక్షణకు సింగరేణి సంస్థ తీసుకుంటున్న చర్యలు బాగున్నాయన్నారు. అనంతరం సీహెచ్‌పీ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏరియా ఇంజినీర్ చంద్రశేఖర్‌రెడ్డి, క్వాలిటీ మేనేజర్ వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్‌పీ ఇన్‌చార్జి డీజీఎం మోహన్, ఫారెస్టు అధికారి రమణారెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయం ఎదుట సివిక్ కార్మికుల ధర్నా



ధర్నా చేస్తున్న సివిక్ కార్మికులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి సివిక్ డిపార్టుమెంట్ లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు సీఐఎల్ మాదిరిగా వేతనాలు ఇవ్వాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ చాంద్‌పాషా డిమాండ్ చేశారు. బుధవారం గోలేటి టౌన్‌షిప్ లోని జీఎం కార్యాలయం ఎదుట సివిక్ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి ఉత్పత్తి, ఉత్పాదకతలో పర్మినెంట్ కార్మికులతో పాటు కాంట్రాక్టు కార్మికులు కూడా భాగస్వాములు అవుతున్నప్పటికీ సంస్థ ఆర్జించిన లాభాల్లో వాటా దక్కడం లేదన్నారు. ఒకే కుటుంబం, ఒకే గమ్యం, ఒకే లక్ష్యం అంటూనే సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షత చూపుతోందన్నారు. 18 రోజుల సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటిని అమలు చేయకుండా సమ్మె విచ్ఛిన్నానికి పాల్పడిన వారితో లోపాయికారిగా వ్యవహరిస్తూ కార్మికుల కడుపుకొడుతున్నారన్నారు. కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షతను వీడి పర్మినెంట్ కార్మికుల మాదిరిగా ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఇన్‌చార్జి ఎస్‌వోటూ జీఎం ఉమాకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం, నాయకులు పోచం, శ్రీనివాస్, సికిందర్, కుమార్, పోసుబాయి, శకుంతల, సావిత్రి, ఓదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కాజేసిన నగదు ఇప్పించాలని వేడుకోలు


వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు

మందమర్రిరూరల్(చెన్నూర్): గతంలో విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి చెందగా వచ్చిన పరిహారం డబ్బుల్లోంచి సగం కాజేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితురాలు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడిగట్టు గ్రామానికి చెందిన దుర్గం లింగయ్య 2020లో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. 2023 జనవరిలో మృతుని భార్య లింగమ్మ పేరిట రూ.5 లక్షల చెక్కు మంజూరైంది. మంచిర్యాల విద్యుత్‌శాఖ ఏడీ లింగమ్మకు చెక్కు అందించారు. బ్యాంకులో డిపాజిట్ చేసిన తర్వాత అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి విద్యుత్ శాఖ అధికారులకు డబ్బులు ఇవ్వాల్సి ఉంటుందని చెప్పి బాధితురాలి ద్వారా బ్యాంకు నుంచి రూ.2.50 లక్షలు విత్‌డ్రా చేయించి కాజేశాడు. ఈ విషయం రెండు రోజుల క్రితం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బాధితురాలికి గ్రామస్తులు అండగా నిలిచారు. అమాయకురాలైన లింగమ్మ డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

28వ రోజుకు పార్ట్‌టైం స్వీపర్ల సమ్మె


సమ్మె చేస్తున్న పాఠశాలల స్వీపర్లు

మంచిర్యాలటౌన్: జిల్లా, మండల ప్రజాపరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైం స్వీపర్ల వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయం ఎదుట చేపట్టిన సమ్మె బుధవారం 28వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము పార్ట్‌టైం స్వీపర్లుగా పనిచేస్తూ కొన్నేళ్లు అవుతోందని, గతంలో రూ.1,623 వేతనం ఇవ్వగా, ప్రస్తుతం రూ.4 వేల చొప్పున ఇస్తున్నారని తెలిపారు. చాలీచాలని వేతనాలతో కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జిల్లా, మండల పరిషత్ పాఠశాలల స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్తునూరి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు గొల్లపెల్లి నారాయణ, ప్రధాన కార్యదర్శి దామరకుంట గంగయ్య, సహాయ కార్యదర్శి సీపెల్లి వెంకటేశం, కోశాధికారి జంపాల శంకర్, సలహాదారులు తోట రాజేశ్వరి, అయిల్ల బయన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థిత్వానికి దరఖాస్తుల వెల్లువ

- జిల్లాలో ఒకే రోజు ఆరుగురు అందజేత
- పెరుగుతున్న ఆశావహుల సంఖ్య


దరఖాస్తు చేసుకుంటున్న కేవీ ప్రతాప్


దరఖాస్తు చేసుకుంటున్న నూకల రమేశ్


దరఖాస్తు చేసుకుంటున్న శ్రీనివాస్ దంపతులు

మంచిర్యాలటౌన్/చెన్నూర్/రామకృష్ణాపూర్: జిల్లాలో కాంగ్రెస్ పార్టీ టికెట్ల కోసం ఆశావహుల సంఖ్య పెరుగుతోంది. బుధవారం ఒక్కరోజే చెన్నూర్ నియోజకవర్గంలో నలుగురు, మంచిర్యాలలో ఒక్కరు అసెంబ్లీ అభ్యర్థిత్వంకోసం టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. చెన్నూర్ నియోజకవర్గానికి చెందిన సింగరేణి ఉద్యోగి డాక్టర్ రాజారమేశ్ ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేసి పొంగులేటి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. తన అనుచరవర్గంతో వెళ్లి టికెట్‌కోసం దరఖాస్తు చేసుకున్నాడు. మందమర్రి పట్టణానికి చెందిన డాక్టర్ దాసారపు శ్రీనివాస్, ఆయన సతీమణి డాక్టర్ దాసారపు విద్యావర్ధిని చెన్నూర్ నియోజకవర్గ అభ్యర్థిత్వం కోసం టీపీసీసీకి దరఖాస్తు చేసుకున్నారు. డాక్టర్స్ సెల్ వైస్‌చైర్మన్‌గా ఉన్న శ్రీనివాస్ కొంత కాలంగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన దుర్గం అశోక్ గత ఎన్నికల్లో బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపాటు జరగడంతో కాంగ్రెస్‌లో చేరారు. నియోజకవర్గంలో పర్యటిస్తూ మణికంఠ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. చెన్నూర్ అభ్యర్థిత్వం కోసం దరఖాస్తు చేసుకున్నారు. మందమర్రి పట్టణానికి చెందిన నూకల రమేశ్ టీపీసీసీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు శిష్యునిగా గుర్తింపు ఉంది. చెన్నూర్ అభ్యర్థిత్వం కోసం కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. మంచిర్యాల అసెంబ్లీ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు కేవీ ప్రతాప్ దరఖాస్తు చేసుకున్నాడు.

జ్వరంతో వలస కూలీ మృతి

- మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు ఏర్పాట్లు
- మానవత్వం చాటుకున్న దాతలు

చెన్నూర్: ఉత్తరప్రదేశ్‌లోని లక్నో జిల్లా గొండి గామ్ గ్రామానికి చెందిన మహ్మద్ ఆలం కొంతకాలంగా స్థానిక సలీం వెల్డింగ్ షాపులో కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య షాబానా (25) వారం రోజులుగా జ్వరంతో బాధపడుతోంది. బుధవారం తీవ్ర అస్వస్థతకు గురికావడంతో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతదేహాన్ని స్వగ్రామం తరలించేందుకు వాహనానికి రూ.80 వేలు అవుతోంది. అతని వద్ద ఆర్థికస్థోమత లేకపోవడంతో విషయం తెలిసిన కొందరు దాతలు స్పందించి మానవత్వం చాటుకున్నారు. రూ.80 వేలు జమచేసి ప్రత్యేక వాహనంలో మృతదేహాన్ని స్వగ్రామం పంపించి ఉదారత చాటుకున్నారు.

ఫొటోగ్రాఫర్‌కు అరుదైన అవకాశం


అరుణ్‌కుమార్

రామకృష్ణాపూర్(చెన్నూర్): రామకృష్ణాపూర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ అరుణ్‌కుమార్‌కు అరుదైన అవకాశం లభించింది. ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లోని సాలార్‌జంగ్ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌లో దేశ నలుమూలల నుంచి పలువురు ఫొటోగ్రాఫర్లు తీసిన చిత్రాలు ప్రదర్శనకు ఉంచారు. అందులో అరుణ్‌కుమార్‌కు సైతం అవకాశం లభించింది.

బీఎస్‌ఎస్‌ఎం వైస్ చైర్మన్‌గా సతీశ్‌కుమార్


సతీశ్ నియామకాన్ని ప్రకటిస్తున్న సామెల్

బెల్లంపల్లి: భారతీయ సర్వ సమాజ్ మహా సంఘ్ (బీఎస్‌ఎస్‌ఎం) తెలంగాణ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా బెల్లంపల్లికి చెందిన కాశీ సతీశ్‌కుమార్ నియామకమయ్యారు. ఈ మేరకు బీఎస్‌ఎస్‌ఎం జాతీయ అధ్యక్షుడు రామ్‌కుమార్ వాలియా ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో బీఎస్‌ఎస్‌ఎం సౌత్ ఇండియా చైర్మన్ మద్దిశెట్టి సామెల్ సతీశ్ నియామకాన్ని ప్రకటించారు.

ప్రజాసమస్యలపై అధికారుల నిలదీత


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి

- జెడ్పీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం
- అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధుల సమస్యల వెల్లువ

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో జెడ్పీచైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, కలెక్టర్ బదావత్ సంతోష్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన జెడ్పీ సమావేశంలో అధికార, ప్రతిపక్ష ప్రజాప్రతినిధులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. జెడ్పీ వైస్ చైర్మన్ తొంగల సత్యనారాయణ, లక్సెట్టిపేట్ జెడ్పీటీసీ ముత్తె సత్తయ్య మాట్లాడుతూ గ్రామాల్లో అధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్సెట్టిపేట్ జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామాల్లో మిషన్ భగీరథ తాగునీటిని అందించక పోవడంతో గ్రామస్తులే బోర్లు వేసుకున్నారని, దానికి కరెంటు బిల్లులను మిషన్ భగీరథ అధికారులే కట్టాలని డిమాండ్ చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ మాట్లాడుతూ చిన్నపాటి గాలి, వానకే విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారన్నారు. వేమనపల్లి రోడ్డుకు మరమ్మతులు చేసేందుకు అటవీశాఖ అధికారులు అనుమతులను ఇవ్వాలని జెడ్పీటీసీ రుద్రబట్ల స్వర్ణలత కోరగా డీఎఫ్‌వో శివ్ ఆశిష్ సింగ్ ఒప్పుకున్నారు. లక్సెట్టిపేట్ జెడ్పీటీసీ మాట్లాడుతూ లక్సెట్టిపేట్‌లో చెరువులను కబ్జా చేస్తున్నా ఇరిగేషన్ అధికారులు ఎందుకు చర్యలను తీసుకోవడం లేదని ప్రశ్నించారు. బెల్లంపల్లి ఎంపీపీ గోమాల శ్రీనివాస్ మాట్లాడుతూ రూ.10 లక్షల ఈజీఎస్ నిధులతో కాంట్రాక్టర్ పనులు చేస్తే బిల్లులు చెల్లించడంలో అధికారుల జాప్యంపై నిలదీయగా క్షేత్రస్థాయిలో పరిశీలించి బిల్లులను చెల్లిస్తామని డీఆర్డీవో పీడీ శేషాద్రి తెలిపారు.

అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలి

ప్రజల సంక్షేమం, జిల్లా అభివృద్ధికోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి పనిచేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి అన్నారు. జిల్లాలోని 311 జీపీల్లో 15 వ ఆర్థిక సంఘం ద్వారా నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతోందన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి.రాహుల్, జిల్లా అటవీశాఖ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి నరేందర్, మిషన్ భగీరథ ఈఈ అంజన్‌రావు, విద్యుత్ శాఖ ఎస్‌ఈ శేషారావు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

నస్పూర్: ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్ కుమార్ అన్నారు. బుధవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సమ్మక్క మాట్లాడుతూ ఆశలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రూ.25 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, అర్హులను ఏఎన్‌ఎంలుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లీలా, భాగ్య, కవిత, రాణి, అనురాధ, వెంకటలక్ష్మి, లావణ్య, సుమలత తదితరులు పాల్గొన్నారు.

కాలేజీరోడ్‌లో చైన్ స్నాచింగ్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని కాలేజీరోడ్‌లో బుధవారం రాత్రి జరిగిన చైన్ స్నాచింగ్ కలకలం రేపింది. స్థానిక కాలేజీ రోడ్‌కు చెందిన ఓ రిటైర్డ్ సింగరేణి ఉద్యోగి రోడ్డుపై వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి అతని మెడలోంచి చైన్ లాక్కుని వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంపై స్థానిక ఎస్సై రాజేందర్‌ను సంప్రదించగా దీనిపై ఫిర్యాదు రాలేదన్నారు.